క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగుల అందజేస్తున్న రఘునాథ్ ఫౌండేషన్ సభ్యులు

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు సాయికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలన్నారు. ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు భరత్ యాదవ్, కుమార్ సాగర్, సాయి చరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో అధునాతన బోధనలపై 'ఎఫ్‌డీపీ'

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అధునాతన బోధనలపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగామ్(ఎఫ్‌డీపీ) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్(సీపీడీయూఎంటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్ధిఖీ గురువారం తెలిపారు. సీపీడీయూఎంటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 9 నుంచి 21వ తేదీ వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రెండు వారాలపాటు ఆన్‌లైన్ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.500 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫారమ్‌తోపాటు ఇచ్చిన బ్యాంక్ వివరాలపై చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి ఈ సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. వివరాలకు సెంటర్ ఫ్యాకల్టీ మిస్బాంజార్(9948412484), మహ్మద్ అక్బర్(8373984391)లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం



దిష్టి బొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం చేతకాని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం మసీద్‌బండలో కిషన్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. నిరుద్యోగులను నట్టేట ముంచిన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద 24 గంటల ఉపవాస దీక్ష చేస్తుండగా కిషన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కేసీఆర్ నిరంకుశత్వానికి అద్దం పడుతుందన్నారు. నిరుద్యోగుల ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బీజేపీ అలుపెరగని పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు సాగర్, పద్మ, రమేష్, చంద్రమోహన్, శ్రీశైలం యాదవ్, రమణి, రాజేష్, రవి కాంత్, వినయ్, రాజేష్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



రఘునాథ్‌యాదవ్

గచ్చిబౌలి: సెప్టెంబర్16, 17న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాలు, విజయభేరీ సభ జరగనున్నాయి. ఈ సమావేశాలకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘునాథ్ యాదవ్‌ను పబ్లిసిటీ, బ్రాండింగ్ కమిటీ కన్వీనర్‌గా నియమించింది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి రఘునాథ్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



పటాన్‌చెరు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 9, 10, 12, 24వ వార్డుల్లో ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ప్రతి కాలనీలో హరితహారం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కల్పనఉపేందర్‌రెడ్డి, బోయిని బాలమణిబాలరాజు, ప్రమోద్‌రెడ్డి, కొల్లూరి మల్లేష్, కవితాశ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్ కోఆప్షన్ సభ్యులు యునుస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాస్‌యాదవ్, శేఖర్, చౌటకూరి మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మో! ఆ 'కిలోమీటర్'..

లింకురోడ్డు నిర్మాణంలో అక్కడే జాప్యం..



చందానగర్ రైల్వే ట్రాక్ వద్ద నిలిచిపోయిన లింక్ రోడ్డు పనులు

హఫీజ్‌పేట్ : గచ్చిబౌలిలోని ఐటీ కారిడార్‌కు రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం లింకురోడ్లను నిర్మిస్తోంది. అందులో భాగంగా హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ముంబాయి జాతీయ రహదారి, మైహోమ్ జువెల్, ఆర్టీసీ కాలనీ నుంచి చందానగర్ రైల్వేస్టేషన్ ట్రాక్ మీద నుంచి శేరిలింగంపల్లి సర్కిల్- 20 కార్యాలయం వరకు హెచ్‌ఆర్‌డీసీ ప్రాజెక్టు కింద 5 కిలోమీటర్ల లింకు రోడ్డు వేయాలని సంకల్పించారు. శేరిలింగంపల్లి సర్కిల్- 20 నుంచి చందానగర్ రైల్వే ట్రాక్ వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు వేగంగా పూర్తి చేశారు. ఇక చందానగర్ రైల్వే ట్రాక్ మీదుగా ఆర్టీసీ కాలనీ నుంచి ముంబాయి జాతీయ రహదారి వద్ద ఉన్న జీఎస్‌ఎం మాల్ వరకు ఒక కిలోమీటర్ ఉంటుంది. అది పూర్తిగా జనావాసాల మధ్య ఉండడంతో రోడ్డు పనులకు ఆటంకం ఏర్పడింది. ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. కాగా కొన్ని కాలనీలవాసులు లింకు రోడ్డు వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతాయంటూ కోర్టు మెట్లు ఎక్కారు. ఆర్టీసీ కాలనీ నుంచి ముంబాయి జాతీయ రహదారికి కలుపుతున్న లింక్ రోడ్డులో పూర్తిగా కాలనీలు ఉండడంతో రైల్వే ట్రాక్ మీదు ఫ్లైఓవర్ వేసి నేరుగా జాతీయ రహదారికి కలపాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు. ఇప్పటికే పలు మార్లు ఎమ్మెల్యే గాంధీ, జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతులు అందించామని తెలిపారు.

లింక్ రోడ్డు పూరైతే...

శేరిలింగంపల్లి సర్కిల్- 20 ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి మదీనాగూడలోని జీఎస్‌ఎం మాల్ వరకు లింక్‌రోడ్డు నిర్మిస్తున్నారు. కొన్ని ఆటంకాల వల్ల రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ లింక్ రోడ్డు పూర్తి అయితే ఐటీ ఉద్యోగులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గినట్లే. చందానగర్, మదీనాగూడ, మియాపూర్ తదితర ప్రాంతాల నుంచి గచ్చిబౌలి వెళ్ళే వారికి దూరం తగ్గడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణం కలుగుతుంది.





ఆర్టీసీ కాలనీ వద్ద జనవాసాల నుంచి ముంబాయి జాతీయ రహదారికి లింక్ రోడ్డు ఫ్లైఓవర్‌ను ఇక్కడ నుంచే నిర్మించాలి

60 ఫీట్ల రోడ్డు వేయాలి



ఆర్టీసీ కాలనీ నుంచి మైహోం వరకు 80 ఫీట్ల రోడ్డు వేస్తామని అధికారులు చెప్పారు. కానీ కాలనీలో ఇళ్లు ఉన్నాయి. మాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 60 ఫీట్ల రోడ్డు మాత్రమే వేయాలి. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఫ్లైఓవర్ వేస్తే బాగుంటుంది.

– పద్మారావు, ఆర్టీసీ కాలనీ అధ్యక్షులు

రెండు ఫ్లైఓవర్లకు అనుమతులు వచ్చాయి



ఆర్టీసీ కాలనీ, లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తాం. చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌కు కూడా పక్క ప్రణాళిక ద్వారా విస్తరణ చేయడానికి అధికారులను ఆదేశించాం. రాష్ట్ర ప్రభుత్వం లింక్ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ ముందు నుంచి ఆర్టీసీ కాలనీ మీదుగా జీఎస్‌ఎం మాల్ వద్ద లింక్ రోడ్డు సగం వరకు పూర్తి అయ్యింది. కానీ ఫ్లైఓవర్ నిర్మాణం పనులు పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గాంధీ

కోనేరు వద్ద వసతులు ఏర్పాటు చేయాలి



కోనేరును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువు వద్ద ఉన్న కోనేరును గురువారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వినాయక చవితి సందర్భంగా నిమజ్జన కోసం కోనేరు వద్ద కావాల్సిన కనీస వసతులు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీధి దీపాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేక క్రేన్‌లు, సిబ్బందిని నియమించాలన్నారు. కోనేరు చుట్టు పరిశుభ్రంగా ఉండే విధంగా శానిటేషన్ సిబ్బంది నియమించాలన్నారు. చందానగర్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ కార్తీక్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 20, పచ్చి మిర్చి 45, బెండ 35, కాకర 45, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 40, వంకాయ 30, గోకర 40, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీ ఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 170, వెల్లుల్లి 170.

9 ఏళ్లు.. రూ.9 వేల కోట్ల అభివృద్ధి

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ



ఎమ్మెల్యేగాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, అధికారులను సన్మానిస్తున్న స్థానికులు

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 9 ఏళ్ల కాలంలో రూ.9వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని గౌలిదొడ్డి/గౌరెంకబస్తీ, కట్టెలబస్తీ, ఈగబస్తీ, ఎస్సీకాలనీ, ఇండ్లబస్తీ, పోచమ్మ బస్తీలలో పాదయాత్రను మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు, ప్రతి కాలనీ, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లు, ప్రధానరోడ్ల విస్తరణ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేయడం జరిగిందని ఆయన వివరించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతోనే పెద్ద ఎత్తున నిధులను కేటాయించడంతోనే ఈ స్థాయిలో అభివృద్ధి సాధ్యమయ్యిందన్నారు. చేసిన అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

ప్రత్యేక పూజలు..

రాయదుర్గంలో శతాబ్దాల చరిత్ర కలిగిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని అర్చకుల ఆశీర్వచనం పొందారు. అనంతరం పలువురు స్థానికులు ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్, అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, జలమండలి మేనేజర్ నరేందర్, ఎలక్ట్రికల్ ఏఈ షణ్ముఖరెడ్డి, స్ట్రీట్ లైట్స్ డీఈ మల్లికార్జున్, ఏఈ రాజశేఖర్, ఏఎంఓహెచ్ నగేష్ నాయక్ పాల్గొన్నారు.

అధికార భాష హిందీని ప్రోత్సహించాలి

రాయదుర్గం: జాతీయ అధికార భాష హిందీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో గురువారం హిందీ దివాస్‌వీక్ కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ భాషను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. అనంతరం హిందీ దివాస్ వీక్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమ ముగింపు వేడుకలను ఈనెల 18న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, అధికార భాషా అమలు కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ సయ్యద్ నజ్ముల్‌హసన్, ప్రొఫెసర్లు షగుఫ్తాపర్వీన్, కరణ్‌సింగ్ ఉత్వాల్, విక్వార్‌ఉన్నీసా, డాక్టర్ ఇరాఖాన్, ఎండీ షకీల్, ప్రదీప్‌కుమార్, డాక్టర్ రవీంద్రకుమార్ నాయుడు పాల్గొన్నారు.

కెనరీ ద స్కూల్‌లో..

మియాపూర్: కెనరీ ద స్కూల్‌లో హిందీ దివాస్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఉదయం ప్రత్యేక అసెంబ్లీతో పాఠశాల సమావేశం ప్రారంభమైంది. విద్యార్థులు హిందీలో కవితలు, ప్రసంగాలు, పాటల ద్వారా తమ బాషా ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్, లి డియా క్రిస్టినా, కోఆర్డీనేటర్ నవీన్, సలీం దినాని, ముక్త ప్రతీక్ పాల్గొని భాష గొప్పదనం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఈ ఒక్క రోజుకి హిందీలో మాట్లాడేందుకు నిర్ణయించారు.

చందానగర్ గంగారంలో..

హఫీజ్‌పేట్: చందానగర్ గంగారంలోని మహిళా దక్షిత సమితి విద్యాసంస్థలలోని సుమన్ బాలికల జూనియర్ కళాశాల, వీడీ బజాజ్ మహిళా డిగ్రీ కళాశాల, బన్సీలాల్ మలాని నర్సింగ్ కళాశాలలో గురువారం హిందీ దివాస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త అశోక్ లోహతి హాజరై మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ చేసుకోవాలన్నారు. రాష్ట్రాలలో, దేశంలో హిందీ భాష చాలా ముఖ్యమైందన్నారు. అనంతరం విమలభద్రుక మాట్లాడుతూ.. హిందీ భాష 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగ సభ ద్వారా అధికార భాషగా గుర్తించారన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీ దివాస్‌గా జరుపుతారన్నారు. మహిళా దక్షిత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్, మున్నా జకేటియ, అనురాధ, అనసూయ, కళాశాల ప్రిన్సిపాల్ రమాకుమారి, సుశీల పాటిల్ పాల్గొన్నారు.



కెనరీ ద స్కూల్‌లో వేడుకలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఇతర ప్రొఫెసర్లు



సుమన్ బాలికల జూనియర్ కళాశాలలో..

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు చేస్తున్నారు. గురువారం చేపట్టిన దీక్షలకు ఎంఆర్‌పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ మాదిగ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహ మాదిగ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మొదటి బిల్లుగా ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుతో కేంద్ర ప్రభుత్వంపై పైసా భారం పడదని, అదనంగా రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీ 30 ఏళ్లుగా ఇచ్చిన హామీనే అమలు చేయాలని కోరుతున్నామని, దీనితో ఏ కులానికి, మతానికి కూడా నష్టం జరగదన్నారు. బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపకపోవడంతోనే జాప్యం జరుగుతుందన్నారు. సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీనే ఇప్పటికీ అమలుచేయకపోడమే వారి నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. హైదరాబాద్‌లో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ శేరిలింగంపల్లి కన్వీనర్ కోడిచర్ల ప్రేమ్‌కుమార్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు నరేందర్ మాదిగ, రాజు మాదిగ, సాయిలు మాదిగ, ఎస్ మానయ్య మాదిగ, ప్రవీణ్ మాదిగ, సరోజ, వరలక్ష్మి మాదిగ, భూదేవీ మాదిగ పాల్గొన్నారు.

కాళోజీకి ఘన నివాళి



మాట్లాడుతున్న ఆచార్యులు పిల్లల మర్రి రాములు

రాయదుర్గం: తెలంగాణలో తెలుగు భాషా చైతన్యాన్ని పెంపొందించడంలో కాళోజీ పాత్ర చిరస్మరణీయమని ప్రముఖ సాహితీ విమర్శకులు, హెచ్‌సీయూ ప్రొఫెసర్ పిల్లల మర్రి రాములు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం కాళోజీ నారాయణరావు జయంత్యుత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక చైతన్యానికి, ఉద్యమానికి ప్రతీకగా కాళోజీ నిలిచారన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తెలంగాణ, తెలుగు భాష కోసం పోరాడిన వ్యక్తులలో అగ్రగణ్యులన్నారు. ఈ సమావేశానికి ఆచార్యులు డాక్టర్ భూక్యా తిరుపతి, ఆచార్య విజయలక్ష్మి స్వాగతం పలికి వందన సమర్పణ చేశారు. సమావేశంలో ఆచార్యులు గోనానాయక్, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ శంకర్‌అనంత, డాక్టర్ రాగ్యానాయక్, పీజీ, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

కోమేక్ ఐటీ కంపెనీ సందర్శించిన డచ్ దేశ ప్రతినిధులు



హఫీజ్‌పేట్: రాయదుర్గంలోని నాలెడ్జ్‌సిటిలోని గ్లిబియా, ప్లానస్ సంస్థలను నెదర్లాండ్స్ కాన్సుల్ జనరల్ (సౌత్ ఇండియా) ఈవాట్ డివైట్, ఇండస్ట్రీయల్ పాలసీ టాప్ సెక్టార్స్ డైరెక్టర్ మార్టిన్ స్కిడ్స్ గురువారం సందర్శించారు. ఇటీవల దేశ రాజధానిలో జరిగిన జీ-20 సదస్సులో పాల్గొన్న డచ్ దేశ ప్రతినిధులు నగరానికి వచ్చి ఐటీ సంస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్లిబియా ప్రొడక్ట్ ఇంజినీరింగ్ కోమేక్ ఐటీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ భార్గవ్, డొమైన్ హెడ్ ఐజి రెడ్డి మాట్లాడుతూ.. తమ సంస్థ అత్యాధునిక సదుపాయాలతో 16 కంటే ఎక్కువ సంస్థలకు చెందిన ప్రతినిధులతో తీర్చిదిద్దబడిందన్నారు. విభిన్న రంగాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న తాము సాఫ్ట్‌వేర్ ప్రాడక్ట్ డెవలప్‌మెంట్ సంస్థలకు సాంకేతిక పురోగతి పాటు కీలకమైన సాంకేతికను అందిస్తున్నామన్నారు. భారత్, నెదర్లాండ్స్ మధ్య ఆలోచనలను పంచుకోవడంతో పాటు, ఆయా రంగాల్లో అవసరమైన జ్ఞానాన్ని పెంచుకోవడం, సంస్కృతి సంప్రదాయ అవగాహనను పెంచుకోవడానికి ఈ పర్యాటన ఎంతో ఉపయోగపడిందన్నారు. 16 ఏళ్లుగా గ్లిబియా ప్రొడక్ట్ ఇంజినీరింగ్ సంస్థ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తి అభివృద్ధి సంస్థల కోసం అవసరమైన ఉత్పత్తులను అందించడంతో పాటు నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తుందన్నారు. సరికొత్త ఆవిష్కరణలకు ఎక్కువగా ప్రాధానమిచ్చే నెదర్లాండ్స్ భారత్‌లో నైపుణ్యంతో కూడిన ఉద్యోగుల ద్వారా తమ లక్ష్యాలను చేరుకోవాలని భావిస్తుందని అభిప్రాయం పడుతున్నానన్నారు. రానున్న రోజుల్లో నూతన ఆవిష్కరణలు, సాఫ్ట్‌వేర్ ఎగుమతులు పెరుగుతాయన్నారు.

రూ.2.61 కోట్లతో యూజీడీ పనులకు శంకుస్థాపన



యూజీడీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: చందానగర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ పరిధిలో శాశ్వత పరిష్కారం కోసం నూతనంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపడుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం రూ.2.61 కోట్ల నిధులతో యూజీడీ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, పూజితగౌడ్, జగదీశ్వర్ గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదాపూర్ డివిజన్ పరిధిలోని రాజారాం కాలనీ, మాతృశ్రీనగర్, గోకుల్ ప్లాట్స్ కాలనీలలో సుమారు రూ.87 లక్షల నిధులతో యూజీడీ పైప్‌లైన్ నిర్మిస్తున్నామన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో హుడా కాలనీ, గంగారం గ్రామంలో రూ.87 లక్షలతో, చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, సిటిజన్ కాలనీ, సురక్ష ఎన్‌క్లేవ్, శంకర్‌నగర్ కాలనీలలో రూ.87 లక్షలతో నూతనంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణంకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్లు సుబ్రమణ్యం, పూర్ణేశ్వరి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గౌతమ్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.